




# కరపత్రం

SINCE 2014

సోమవారం మార్చి 23, 2026 సంపుటి : 2 సంచిక : 161 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4





## అన్ని నియోజకవర్గాలు ఒక్కటే..

# వివక్ష మా ఇంటా వంటా లేదు

- అన్ని నియోజకవర్గాలకు సమాన ప్రాధాన్యం: సీఎం రేవంత్
- "వివక్ష మా ఇంటా వంటా లేదు" స్పష్టం
- యూరియా కొరతపై ఆందోళన
- రామగుండం యూరియా మనకే ఇవ్వాలని డిమాండ్
- ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలన్న పిలుపు
- ప్రతిపక్షాల సమస్యలు పరిష్కరిస్తామన్న హామీ
- BRS నియోజకవర్గాలకూ అభివృద్ధి చేస్తామన్న మాట
- ఆయిల్ ఫ్యాక్టరీలు రెండు చోట్ల నిర్మాణం
- పామాయిల్ సాగుకు ప్రోత్సాహం
- పంట మార్పిడిపై రైతులకు సూచనలు
- 10 లక్షల ఎకరాల పామాయిల్ కొనుగోలు హామీ
- రైతుల ఆదాయం పెంపే లక్ష్యం

హైదరాబాద్:
పశ్చిమాసియాలో యుద్ధం వల్ల రాబోయే రోజుల్లో మనకు యూరియా కొరత వచ్చేలా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రామ గుండం ఫ్యాక్టరీ యూరియా అంతా మనకే దక్కేలా బీజేపీ ఎంపీలు సహకరించాలని కోరారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేద్దాం.. ఎన్నికలు లేనప్పుడు ప్రాంతాల అభివృద్ధికి పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలు సమస్యలు తీసుకువచ్చిన ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుతో రాజకీయాంగా భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు కానీ ఆ నియోజకవర్గాల ప్రజల అభివృద్ధి కోసం కూడా పని చేస్తామన్నారు. తాను ఏ నియోజకవర్గంపైన వివక్ష చూపించనని.. వివక్ష మా ఇంటా వంటానే లేదని చెప్పారు. సిద్ధిపేట జిల్లాలోని నర్మెట్ట ఆయిల్ ఫ్యాక్టరీని కొడంగల్?కు తరలించగలిగేవాణ్ని కానీ తాను అలా చేయలేదన్నారు. కొడంగల్ లోనూ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పామాయిల్ సాగు లాభసాటి వ్యవసాయమని.. రైతుల ఆదాయం కూడా పెరుగుతోందని అన్నారు. సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయిల్ ఫ్యాక్టరీని ఆదివారం (మార్చి 22) సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభి రైతులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలని సూచించారు.గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయాలు, పండ్లు, ఆకుకూరలు బాగా పండించేవారని.. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల రంగారెడ్డి జిల్లా పంటల సాగు తగ్గిందన్నారు. పంట మార్పిడికి రైతులను ప్రభుత్వ ప్రోత్సహిస్తోందని తెలిపారు. మిల్లెట్స్, ఆకు కూరలు, పామాయిల్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. పంట మార్పిడితో రైతులకు మంచి ధర వచ్చేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.పాలు, కోడిగుడ్లు, కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని.. రైతుల ఆదాయం పెరగాలంటే వరి పండించడం ఒక్కటే పరిష్కారం కాదన్నారు. పంట మార్పిడికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతులు పండించిన వాణిజ్య పంటలను ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి రైతు కారు కొనుక్కునేలా ఆదాయం పెరగాలని సూచించారు. బంగారు తెలంగాణ అంటే ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడమేనని అన్నారు.

## రైతులకు సీఎం రేవంత్ గుడ్ న్యూస్

### - రైతు భరోసా నిధులు రిలీజ్

హైదరాబాద్:
తెలంగాణ రైతాంగానికి సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. యాసంగి సీజన్ కు సంబంధించిన రైతు భరోసా నిధులు విడుదల చేశారు. ఆదివారం (మార్చి 22) సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా తొలి విడత రైతు భరోసా నిధులు రిలీజ్ చేశారు.
ఫస్ట్ ఫేజ్ లో భాగంగా రూ.3600 కోట్ల నిధులు విడుదల చేయగా 70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇవాళ ఆదివారం (మార్చి 22) కావడంతో రైతు భరోసా నిధులు సోమవారం (మార్చి 23) రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. మిగితా నిధులు రెండు విడతల్లో ప్రభుత్వం రైతు ఖాతాల్లో జమ చేయనుంది.

## కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి

# గుడ్‌బై

- » మార్చి 25న రాజీనామా
- » "అవమానాలు భరించలేను"
- » 40 ఏళ్ల బంధానికి ముగింపు
- » BRSలో చేరికకు క్లారిటీ
- » బుజ్జగింపులు విఫలం
- » జగిత్యాలలో కలకలం
- » అనుచరులతో కీలక భేటీ



జగిత్యాల జిల్లా:
రాజీనామాపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తాను ఇక కాంగ్రెస్‌లో కొనసాగలేనని.. ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అవమానాలు భరిస్తూ కాంగ్రెస్‌లో ఉండలేనంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రెస్‌మీట్‌లో రాజీనామాను ప్రకటించిన జీవన్‌రెడ్డి.. గులాబీ కండువా కప్పుకోనున్నట్టు వెల్లడించారు. పార్టీని వీడడానికి గల కారణాలపై కూడా జీవన్‌రెడ్డి లేఖ విడుదల చేశారు.కాంగ్రెస్‌లో అవమానాలు భరించలేకే ఈ నిర్ణయం తీసుకున్నానన్న జీవన్‌రెడ్డి.. 40 ఏళ్ల బంధానికి స్వస్తి చెప్పారు. నాలుగు దశాబ్దాలుగా తనతో పాటు ప్రయాణం చేస్తున్న తన అనుచరులు, కాంగ్రెస్ నాయకులకు ఆయన బహిరంగ లేఖ రాశారు. 25న సమావేశంలో చర్చించేందుకు కలుద్దామన్న జీవన్‌రెడ్డి.. గత 20 మాసాలుగా జగిత్యాలలో జరుగుతున్న పరిణామాలు మీరంతా గమనించారన్నారు.ఇదిలా ఉండగా, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుజ్జగింపులు ఫలించలేదు. శనివారం జగిత్యాలలోని జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చి గంటకుపైగా ఆ యనతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఈనెల 25న పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు జీవన్‌రెడ్డి నుంచి మొదట నుంచి బలమైన సంకేతాలు ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఇప్పటికే జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడగా, రెండురోజుల క్రితం పీసీసీ సభ్యుడు కత్తి వెంకటస్వామి, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వయంగా జీవన్‌రెడ్డి ఇంటికి వచ్చి చర్చించారు. కానీ ఆయన నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో తాజాగా మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు రంగంలోకి దిగారు. ఆయన ఇంటికి చేరుకుని చర్చలు జరిపారు. అయినా కూడా జీవన్‌రెడ్డి తన రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదు.

## ధరణిని బంగాళాఖాతంలో పడేశాం..

### సాదాబైనాలకు పరిష్కారం చూపాం: మంత్రి పొంగులేటి



2లో..

రైతుల కళ్లలో ఆనందం చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎన్నికుట్రలు చేసినా రైతు సంక్షేమం ఆపమన్నారు. రైతులకు అనేక సమస్యలు సృష్టించిన ధరణిని బంగాళాఖాతంలో కలిపామన్నారు. సాదాబైనామాలన్నింటికీ పరిష్కారం చూపామన్నారు. ఆదివారం (మార్చి22) సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు మంత్రి పొంగులేటి.



2 లో

## భారత్ చేరిన అమెరికా ఎల్‌పీజీ నౌక

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా చమురు, ఎల్‌పీజీ సరఫరా గొలుసుకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలో ముఖ్యంగా ఎల్‌పీజీకి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఊరటనిచ్చేలా అమెరికాకు చెందిన ఎల్‌పీజీ నౌక భారత్‌కు చేరింది. అమెరికాలోని టెక్సాస్ నుంచి బయల్దేరిన పయనీర్ నౌక ఎల్‌పీజీ లోడ్‌తో కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు ఆదివారం చేరుకుంది.

## హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం

- వైకాపా కాలంలో అమరావతి నిర్లక్ష్యం
- స్మార్ట్ సిటీగా అభివృద్ధి లక్ష్యం
- ఐటీ అభివృద్ధిలో తన పాత్ర గుర్తుచేసుకున్నారు
- Bill Gat వంతో గతంలో చర్చలు
- ఏఐ, డ్రోన్లు, గ్రీన్ ఎనర్జీపై ఫోకస్



2లో..



## 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్'లో ప్రభుత్వం కీలక సవరణలు

హైదరాబాద్:
'తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012'కి సంబంధించి ప్రభుత్వం కీలక సవరణలు చేసింది. ఈ మేరకు జీవో జారీ చేసింది. దీని ప్రకారం.. 21 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తుతో నిర్మించనున్న వాటిని హైరైజ్ భవనాలుగా గుర్తించనున్నారు. 750 చ.మీ నుంచి 2000 చ.మీలు ఉన్న స్థలంలో 18-21 మీటర్ల భవనాలు నిర్మించాలంటే టీడీఆర్ వినియోగం తప్పనిసరి. నాన్ హైరైజ్ భవనాలకు టీడీఆర్ వినియోగంతో సెట్‌బ్యాక్ సడలింపు ఇచ్చారు. ఇప్పటి వరకు 2012లో జారీ చేసిన ఉత్తర్వులోని నిబంధనలు అమల్లో ఉన్నాయి. వాటికి కాలానుగుణంగా ప్రభుత్వాలు సవరణలు చేశాయి. వీటివల్ల లాభంతో పాటు సమస్యలూ వస్తున్నాయని ప్రణాళిక విభాగం భావించింది. అదే సమయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ 2016లో నిర్మాణ అనుమతులకు కొత్త చట్టాలను తీసుకొచ్చింది. వాటిని దృష్టిలో ఉంచుకుని కొత్త నిబంధనలను ప్రభుత్వం తీసుకొచ్చింది.



## బీజేపీ నేతలు పదవులకోసం..

### కులాల మధ్య చిచ్చి పెడుతున్నరు

- » బీజేపీపై మహేష్ గౌడ్ తీవ్ర విమర్శలు
- » కులాలు, మతాల మధ్య చిచ్చి పెడుతున్నారన్న ఆరోపణ
- » "పదవుల కోసమే రాజకీయాలు" వ్యాఖ్య
- » మోదీ, సావర్కర్‌పై విమర్శలు
- » BRS పాలనపై కూడా మండిపాటు
- » కాళేశ్వరం పనికిరాదన్న వ్యాఖ్య
- » కాంగ్రెస్ హామీలు అమలు చేస్తున్నామన్న ధీమా
- » రేవంత్ పథకాలపై ప్రశంసలు
- » ఏప్రిల్‌లో కార్పొరేషన్ పదవుల భర్తీ
- » రాష్ట్రంలో BJP vs కాంగ్రెస్ పోటీ అన్న అభిప్రాయం

2లో..



## రాష్ట్రం అప్పుల్లో ఉన్నా రైతులకు రుణ మాఫీ చేసినం: మంత్రి వివేక్

హైదరాబాద్:
సీఎం రేవంత్ రెడ్డి రైతులు గురించి ఆలోచిస్తున్నారని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం (మార్చి 22) సిద్దిపేట జిల్లా నర్మెట్టలో సీఎం రేవంత్ రెడ్డి ఆయిల్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్న ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు.

మిగతాద్ది 2 లో

## 'పేదల ఇళ్లు కూలగొట్టడం

# సరికాదు

- » మూసీ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకం కాదని దీక్షా
- » పేదల ఇళ్లు కూల్చడం సరికాదన్న రాంచందర్‌రావు
- » "అభివృద్ధి కాదు.. అవినీతే" కాంగ్రెస్‌పై విమర్శ
- » కాళేశ్వరం జం మూసేశ్వరం సెటైర్
- » ప్రాజెక్ట్ నిధులపై ప్రశ్నలు
- » హామీలకే డబ్బుల్లేవన్న వ్యాఖ్య
- » సోమాజిగూడలో చర్చా కార్యక్రమం
- » మూసీ పునరుజ్జీవంపై సందేహాలు



హైదరాబాద్:
మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్‌కు తాము వ్యతిరేకం కాదని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. అయితే మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లు కూలగొట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ చేసే అభివృద్ధి ఏమీ ఉండదని, అంతా అవినీతే ఉంటుందని విమర్శించారు. లక్షన్నర కోట్ల రూపాయిలతో కేసీఆర్ కాళేశ్వరం అంటే,.. ఇప్పుడు రేవంత్ మూసేశ్వరం అంటున్నారని సెటైర్లు వేశారు.ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడలోని ఓ హోటల్‌లో మూసీ పునరుజ్జీవం-వాస్తవాలు అంశంపై రాంచందర్ రావు అధ్యక్షతను చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంచందర్ రావు మాట్లాడుతూ.. ఎ?న్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలకే నిధులు లేవంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మరి మూసీ ప్రక్షాళనకు నిధులు ఎక్కడ నుంచి తీసుకొస్తుందో అని ప్రశ్నించారు.

## రాష్ట్రం అప్పుల్లో ఉన్నా రైతులకు రుణ మాఫీ చేసినం: మంత్రి వివేక్

మొదటిపేజీ తరువాయి
రాష్ట్రంలో అద్భుతమైన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని.. కొత్త ఉద్యోగాల కల్పనకు ఏటీసీలు ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్కిల్ నేర్పించి ఉద్యోగాలు ఇప్పిస్తున్నామన్నారు. ఏటీసీలో ట్రైనింగ్ తీసుకుని విద్యార్థులకు రూ.2 వేలు ఇస్తున్నామని తెలిపారు. సిద్ధిపేటలో ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారన్నారు.

## బీజేపీ నేతలు పదవులకోసం..

### కులాల మధ్య చిచ్చి పెడుతున్నరు

మొదటిపేజీ తరువాయి
బీజేపీ నేతలపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. దేశ నిర్మాణంలో మోదీ గానీ, మోదీ కుటుంబం గానీ పనిచేయలేదు..దేశభక్తుడు చెప్పుకుంటున్న సావర్కర్ బ్రిటీష్ వాళ్ల కాళ్ల దగ్గర మోకరిల్లుండు.. అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ బీజేపీ నేతలు దేశం కోసం పనిచేయలేదు.. కేవలం పదవులకోసమే మతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు.
గత బీఆర్ ఎస్ పాలనలో విజన్ లేకపోవడం వల్లే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలనున అమలు చేస్తోందన్నారు. కేవలం దోచుకోవడమే లక్ష్యంగా పనికిరాని కాళేశ్వరం కట్టారని అన్నారు. బీఆర్ ఎస్ పాలనలో దొడ్డుబియ్యం స్మగ్లింగ్ చేసి కేసీఆర కుంటుంబం జేబులు నింపుకుందన్నారు మహేష్ గౌడ్. సీఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యం పథకం ద్వారాపేదల కడుపు నింపుతున్నారని అన్నారు.
ఏప్రిల్ చివరి వారం లోగా అన్ని కార్పొరేషన్ పదవులు భర్తీ చేస్తామన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయింది.. మళ్లీ మొలకెత్తదు.. రాష్ట్రంలో బీజేపీయే కాంగ్రెస్ పోటీ అన్నారు. సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళితే మళ్లా కాంగ్రెస్ పార్టీ దే అధికారం అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## భారత్ చేరిన అమెరికా ఎల్‌పీజీ నౌక

మొదటిపేజీ తరువాయి
దీంతోపాటు రష్యాకు చెందిన చమురు నౌక కూడా దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. అక్వాటైటాన్ పేరుతో రష్యా నుంచి వచ్చిన ఈ నౌక శనివారమే మంగళూరు పోర్టును చేరినట్లు పలు ఆంగ్ల మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు సంక్షోభాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చి 12 నాటికి రష్యా నౌకల్లో లోడ్ చేసిన చమురును కొనుగోలు చేయొచ్చని అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రష్యా నౌక భారత్‌కు చేరుకోవడం గమనార్హం.

## ధరణిని బంగాళాఖాతంలో పడేశాం..

మొదటిపేజీ తరువాయి
అంతకుముందు మూడు వందల కోట్ల రూపాయలతో సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీనిసీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఫ్యాక్టరీని ప్రారంభించి రైతన్నలకు అంకితం చేశారు. అక్కడే రూ.80 కోట్లతో నిర్మించే రిఫైనరీ యూనిట్?కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయిల్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రులు వివేక్ వెంకట స్వామి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.
కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంటకస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అద్భుతమైన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని.. కొత్త ఉద్యోగాల కల్పనకు ఏటీసీలు ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్కిల్ నేర్పించి ఉద్యోగాలు ఇప్పిస్తున్నామన్నారు. ఏటీసీలో ట్రైనింగ్ తీసుకుని విద్యార్థులకు రూ.2 వేలు ఇస్తున్నామని తెలిపారు. సిద్ధిపేటలో ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారన్నారు.

## హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్‌ను మించేలా అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. వైకాపా పాలనలో అమరావతిని పూర్తిగా పక్కన పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యంత అధునాతన టెక్నాలజీతో అమరావతిని స్మార్ట్ సిటీగా మారుస్తామన్నారు. కృత్రిమ మేధ వినియోగం, విస్తరణ లక్ష్యంగా గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ఏర్పాటు చేసిన సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్‌లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1990 దాటాక మనవద్ద ఇంటర్నెట్ ప్రారంభమైందనీ, 1995 నుంచి నాలెడ్జ్ ఎకానమీ మొదలైందని చెప్పారు.
"ఉమ్మడి ఏపీలో ఐటీ కంపెనీలు తెచ్చేందుకు అనేకమందితో మాట్లాడా. దిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిశా. భారత్‌లో ఐటీ కంపెనీలు పెట్టాలని కోరా. లెక్కలు, ఇంగ్లీష్‌లో భారతీయులు గొప్పవాళ్లని ఆయనకు చెప్పా. హైదరాబాద్‌లో ఐటీ కార్యాలయం పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరా. అప్పట్లో హైదరాబాద్ వచ్చేందుకు వాళ్లు తొలుత నిరాకరించారు. అక్కడికి వస్తే మాకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తారని అడిగారు. అప్పట్లో ఐఎస్‌బీ తెచ్చేందుకు ఎంతో కృషి చేశా. శంషాబాద్ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు సేకరించాం. హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చాం. అప్పట్లో కేవలం మంజీరా నుంచే తాగునీరు వచ్చేది. కానీ, కేవలం 9 నెలల్లోనే కృష్ణానది నుంచి తాగునీరు తీసుకొచ్చాం.
1999-2004 మధ్య హైదరాబాద్‌ను శరవేగంగా అభివృద్ధి చేశాం. అప్పట్లో నేను కృషి చేయడం వల్లే జినోమ్ వ్యాలీ వచ్చింది. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయాం. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పదేళ్లు పట్టింది. 2014 నుంచి 2019 వరకు ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడితే ఎన్నికల్లో గెలవలేం. 2019 నుంచి 2024 మధ్య ఏపీలో అభివృద్ధి కుంటుపడింది. 2024లో మళ్లీ వచ్చాక అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. ఇప్పుడు అనేక రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. 30 ఏళ్ల క్రితమే ఐటీ గురించి ఆలోచించా. ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటమ్, స్పేస్ టెక్నాలజీ వచ్చాయి. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌లు త్వరగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీ ఎలా ఉందో చూస్తున్నాం. విద్యుత్ సమస్యలను అధిగమించి మిగులు వరకు తీసుకొచ్చాం. సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీరంగంలో దక్షిణాదిలో మేమే నెంబర్‌వన్ " అని చంద్రబాబు అన్నారు.

## తమిళనాడు, కేరళను ఆనుకుని ఉపరితల ఆవర్తనం 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం

మన్నార్ గల్ఫ్ నుంచి దక్షిణ కర్ణాటక అంతర్గత ప్రాంతాలు, తమిళనాడు, పరిసరాల్లో కేరళ ఆనుకొని ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఈ నెల 24వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీవర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

# మరో భారీ సైబర్ మోసం

- మోసపోయిన మాజీ డిజిపి మనవరాలు
- నకిలీ వాట్సాప్ మెసేజ్‌తో టోకరా
- ఖాతా నుంచి 1.20 కోట్లు మాయం

**హైదరాబాద్,మార్చి21 :**
టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల యజమానుల పేర్లతో అకౌంటెంట్లను, ఉద్యోగులను మోసం చేయడం ఇప్పుడు నేరగాళ్లకు పరిపాటిగా మారింది. తాజాగా హైదరాబాద్‌లో ఒక ఉన్నత స్థాయి మహిళా వ్యాపారవేత్త మాజీ డీజీపీ మనుమరాలుని భారీగా మోసగించారు. ఈ ఘటన మరోసారి సైబర్ నేరగాళ్ల చాకచక్యాన్ని బయటపెట్టింది. ఈ ఘటనపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మహిళా వ్యాపారవేత్త, మాజీ డీజీపీ మనవరాలికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. దివ్యారెడ్డి 18 కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు. సైబర్ నేరగాళ్లు ఆమెతో పాటు అకౌంటెంట్‌ను మోసం చేశారు. ఈ నెల 13న దివ్యారెడ్డి పేరు, ఫొటోతో ఉన్న వాట్సప్ ఖాతా నుంచి అకౌంటెంట్‌కు మెసేజ్ వచ్చింది. తాను మీటింగ్‌లో ఉన్నానని.. చెప్పిన ఖాతాకు రూ.1.20 కోట్లు పంపాలని అందులో ఉంది. దీంతో అకౌంటెంట్ ఆ డబ్బును పంపారు. ఈ నెల 17న మరోసారి డబ్బు పంపాలంటూ వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఈ క్రమంలో డబ్బులు పంపేందుకు చెక్ అప్రూవల్ కోసం డైరెక్టర్‌ను అకౌంటెంట్ సంప్రదించారు. గతంలో చేసిన రూ.1.20 కోట్ల లావాదేవి వివరాలను అకౌంటెంట్ చెప్పారు. తాను ఎవరికీ డబ్బు పంపమని చెప్పలేదని దివ్యారెడ్డి స్పష్టతనిచ్చారు. వెంటనే బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఘటనలో సైబర్ నేరగాళు అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. ఈ నెల 13న మహిళా వ్యాపారవేత్త పేరు, ఫొటోతో ఒక ఫేక్ వాట్సాప్ అకౌంట్ సృష్టించారు. ఆ అకౌంట్ నుంచి ఆమె సంస్థలో పనిచేసే అకౌంటెంట్‌కు మెసేజ్ పంపించారు. 'మీటింగ్‌లో ఉన్నానని.. వెంటనే ఈ ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయండి' అంటూ తెలిపారు. ఆ సందేశాన్ని నిజమని నమ్మిన అకౌంటెంట్ ఎలాంటి అనుమానం లేకుండా ఒకే ట్రాన్సాక్షన్‌లో రూ.1.20 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారు.
ఈ మోసం వెంటనే బయటపడలేదు. ఈ నెల 17వ తేదీన అదేవిధంగా మరోసారి మెసేజ్ వచ్చింది. ఈసారి డబ్బులు పంపేముందు అకౌంటెంట్ చెక్ అప్రూవల్ కోసం మహిళా వ్యాపారవేత్తను సంప్రదించారు. అప్పుడే అసలు విషయం బయటపడింది. 'నేను ఎలాంటి డబ్బు పంపమని చెప్పలేదు' అని ఆమె చెప్పడంతో ముందే జరిగిన ట్రాన్సాక్షన్ గురించి తెలుసుకుని ఆ మహిళా షాక్‌కు గురయ్యారు. మోసం తెలిసిన వెంటనే బాధితురాలు 1930 నంబర్ ద్వారా సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా కంప్లైంట్ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ విచారణలో భాగంగా కేరళకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల రూ.1.20 కోట్ల భారీ నష్టం జరిగిందని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని సైబర్ క్రైం పోలీసులు సూచించారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయమని మెసేజ్ వస్తే తప్పనిసరిగా కాల్ చేసి నిర్ధారించాలని సూచించారు. వాట్సాప్ మెసేజ్‌లను నమ్మకూడదని, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని అన్నారు. పెద్ద మొత్తాల లావాదేవీలకు డబుల్ వెరిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## తెలుగు రాష్టాల్లో రంజాన్ సందడి

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు - హైదరాబాద్ ద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. తెలుగు రాష్టాల్లోన్రూ రంజాన్ శోభ కనిపించింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శు భాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఇక, హైదరాబాద్ నగరం సైతం రంజాన్ వేడుకలకు సిద్ధమైంది. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు ముస్లిం సోదరులు. చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఇవాళ(శనివారం) ఉదయం 10గంటలకు ప్రారంభంకానున్నాయి. మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు చేయనున్నారు. పాతబస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరాలం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకుంటున్నారు. మరికొద్దిసేపట్లో సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. మీరాలం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారతదేశంలో రంజాన్ పండుగను శనివారం జరుపుకుంటున్నారు.

## ఐటి రంగంలో భారీగా తగ్గిన ఉద్యోగాలు

- ప్రభుత్వం సమాధానం చెప్పాలి: కెటిఆర్

రాష్ట్రంలోని ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గుదలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని ప్రభుత్వం ఒక్క వారంలోనే రెండుసార్లు ఒప్పుకోవడం ఆందోళనకరమైన విషయామని అన్నారు. 2023లో హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో 9.46లక్షల ఉద్యోగాలు ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ 2026 నాటికి అవి 9.39 లక్షలకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మొదట మార్చి 16న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వెల్లడించారని చెప్పారు. అనంతరం బ్జడెట్ ప్రవేశపెడుతున్న సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని తెలిపారు.ఐటీ సెక్టార్‌లో గణనీయంగా ఉద్యోగాల తగ్గుదలపై వారం వ్యవధిలోనే ప్రభుత్వం రెండు సార్లు అంగీకరించడం ఆశ్చర్యకరమని కేటీఆర్ అన్నారు. ఐటీ రంగంలో ఈ ఉద్యోగాల తగ్గుదలకు కృత్రిమ మేధస్సు కారణమా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## హిప్పో దాడిలో పశువైద్యురాలు మృతి

- ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి
- ప్రభుత్వం తరపున 30లక్షల పరిహారం ప్రకటన

కర్ణాటకలో పెను విషాద ఘటన ఒకటి చోటుచేసుకుంది. హిప్పోపోటమస్ దాడిలో పశు వైద్యురాలు ప్రాణాలు కోల్పోయింది. గర్భంతో ఉన్న హిప్పోను చెక్ చేయడానికి వెళ్లిన సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన 27 ఏళ్ల సమీక్షా రెడ్డి త్యావరకొప్ప టైగర్, లయన్ సఫారీలో కాంట్రాక్ట్ బేసిస్ కింద పశు వైద్యురాలిగా సేవలు అందిస్తోంది. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆమె జూలోని సన్ కాపర్ పక్షికి చికిత్స చేయడానికి వెళ్లింది. పక్షికి చికిత్స పూర్తయిన తర్వాత గర్భంతో ఉన్న హిప్పో టెంపరేచర్ చేయడానికి ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ హిప్పో ఆమెపై దాడి చేసింది. తలతో బలంగా సమీక్షారెడ్డిని కొట్టింది. దీంతో ఆమె ఊపిరితిత్తులు, లివర్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. జూ సిబ్బంది ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సమీక్షా రెడ్డి ప్రాణాలు విడిచింది. పశువైద్యురాలి మృతిపై కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బీ ఖండ్రే స్పందించారు. సమీక్షారెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరపు నుంచి 30 లక్షల రూపాయల పరిహారం ప్రకటించారు. ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. కాగా, సమీక్షా రెడ్డి హెబ్బల్‌లోని వెటర్నరీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. 2023లో డిగ్రీ పూర్తి అయిన తర్వాత కొంతకాలం పాటు మంగళూరు సర్కిల్ వైల్డ్ లైఫ్ డాక్టర్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేసింది. ఫిబ్రవరి నెల నుంచి శివమొగ్గ జూలో కాంట్రాక్ట్ బేసిస్ కింద పశువైద్యురాలిగా సేవలు అందిస్తున్నారు. జూలో విధుల్లో చేరి రెండు నెలలు కాకుండానే ఈ విషాదం చోటుచేసుకుంది.

## పశు పోషకులకు ఊరట రుసుములపై సడలింపులు జారీ

పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది. పట్టణాల్లో పశు పోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపునిచ్చింది. భవన అనుమతుల రుసుములో సడలింపులు చేసింది. ఈ సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్నరైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు/మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్, డెవెలప్‌మెంట్ ఛార్జీలు మినహాయింపునిచ్చినట్లు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ నిర్ణయంతో మరింత మందికి స్వయం ఉపాధి, సమృద్ధి లభిస్తుందని వెల్లడించారు. గత జూన్‌లో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక కేంద్రాలుగా టిటిడి ఆలయాలు

- తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకుండా కఠిన చర్యలు
- కాలుష్య రహితంగా తిరుమల క్షేత్రం అభివృద్ధి
- అధికారులకు సిఎం చంద్రబాబు సూచనలు

తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టిటిడి బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

## ఫుడ్ సేఫ్టీలో అత్యాధునిక పరిశోధన శాల అక్రిడిటేషన్ వచ్చాక పూర్తిస్థాయి పరీక్షలు

కొద్దికాలం వ్యవధిలోనే తిరుమలలో ఫుఢ్ సేఫ్టీ పరిశోధన శాలను ప్రారంభించామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ పరిశోధనశాలలో అనేక పరీక్షలు చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పాలు, నెయ్యి, నూనెతో పాటు ముడి సరుకుల నాణ్యతను పరీక్షించవచ్చని చెప్పుకొచ్చారు. తిరుమలలో ప్రతిష్టాత్మకంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ల్యాబ్‌ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన దురదృష్టకరమైన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని 2024లో ఎఫ్ఎస్ఎస్ఏఐతో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుందని తెలిపారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కి అదనంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రస్తావించారు.శనివారం తిరుమలలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.25 కోట్లతో నిర్మించిన ఈ పరిశోధన శాలలో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని వెల్లడించారు. ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ పరిశోధన శాల పని చేస్తోందని వివరించారు. అప్పటి వరకు అనాలిసిస్ జరుగుతునే ఉంటుందని తెలిపారు. మూడు నెలల్లో గుంటూరు, వైజాగ్‌లో పరిశోధన శాలలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో వివిధ ప్రాంతాల్లో 11 స్టేట్ ఫుడ్ ల్యాబ్‌లను ఆధునికీకరించామని అన్నారు. నాణ్యతలో ఎక్కడ రాజీపడ బోమని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

# ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది,

**•రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి,**





ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, అన్నారు. ఆదివారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో 200 కోట్ల రూపాయల అంచనా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 8, 9 వార్డులలో 13 లక్షల రూపాయలతో సి సి రహదారి నిర్మించడం జరిగిందని, శ్రీనివాస గార్డెన్ నుండి అమ్మ గార్డెన్ వరకు 1 కోటి 80 లక్షల రూపాయలతో హైమాస్ లైట్ల ఏర్పాటు కొరకు శంకుస్థాపన చేయడం జరిగిందని, 30 రోజులలో నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా మందమర్రి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 40 కోట్ల రూపాయలు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో 51 లక్షల రూపాయల నిధులతో సిసి రహదారులు నిర్మించి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా 32 కోట్ల రూపాయల వ్యయంతో క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో రహదారులు, మురుగు కాలువలు, లైటింగ్, త్రాగునీటి పనులు చేపట్టడం జరుగుతుందని, ఇంటర్నల్ పైప్ లైన్ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడం జరుగుతుందని, మున్సిపల్ పరిధిలోని ఒక్కొక్క వార్డులో దాదాపు 2 కోట్ల రూపాయల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి, చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీలలోని అన్ని వార్డులలో అమృత్ పథకం క్రింద త్రాగునీటిని అందించడం జరుగుతుందని, డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో 24 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించిన సిసి రహదారి ప్రారంభించడం జరిగిందని, 60 లక్షల రూపాయల టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో 40 హైమాస్ లైట్లను పట్టణంలో ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయని, అమృత్ పథకం పనులను 6 నెలలలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులకు ఇబ్బందులు లేకుండా స్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద 2 కోట్ల 9 లక్షల రూపాయలతో చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని, 3 నెలలలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యాతనపల్లిలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని, ఓపెన్ జిమ్, కుర్మపల్లి శివారులో రైలింగ్, చే లింక్, ఫెన్సింగ్, బోటింగ్ ఇతర అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేసే విధంగా అధికారుల సమన్వయంతో పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో 50 లక్షల రూపాయలతో సిసి రోడ్లను ప్రారంభించడం జరిగిందని, ప్రజల సౌకర్యార్థం బోర్ వెల్స్, హైమాస్ లైట్లు ఏర్పాటు దిశగా కృషి చేస్తామని తెలిపారు. సి సి రోడ్డు, 2 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం కింద చర్యలు తీసుకోవడంతో పాటు ఊరు మందమర్రిలో ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు 2 కోట్ల 31 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో సి సి రహదారులు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టి ప్రజా ప్రయోజనకరమైన కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి చర్యలలో భాగంగా డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులను వినియోగించి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయల డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టి 20 శాతం పూర్తి చేయబడి మిగతా పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా సోలార్ హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడం ద్వారా మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లు తగ్గించడంతోపాటు ప్రజలకు ఉపయోగకరమైన వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా 21 సోలార్ హైమాస్ లైట్లు మంజూరు చేయబడి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అమృత్ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ అందించి శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెరువులు, కుంటలు ఇతర నీటి వనరులను అభివృద్ధి చేసి శుద్ధం చేసిన నీటి కొరత లేకుండా అందించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, చెరువులను శుభ్రం చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించి నీటి లభ్యత గా కృషి చేస్తున్నామని తెలిపారు. సి సి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థ అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## :శ్రీ వేంకటేశ్వరునికి దర్శనానికి పోటెత్తిన భక్తులు...





మండలంలోని డోకిపర్రు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో విచ్చేసిన భక్తులతో స్వామివారి సన్నిధిలో తాకిడి అధికమైంది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు వేలాది మందికి అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ధర్మకర్తలు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

## సంవత్సరం కూతురుతో ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు

**కరపత్రం ప్రతినిధి చేగుంట, మార్చ్ 22**





మాసాయిపేట గ్రామానికి చెందిన ముక్క స్రవంతి భర్త నరసింహులు, వయసు 25 సంవత్సరములు, వృత్తి గృహిణి గారు తేదీ 18. 03.2026 నాడు తన చిన్న కూతురు వయస్సు 1 ఎతీం గారిని తీసుకుని ఇంట్లో నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు ఇట్టి విషయములో స్రవంతి భర్త ముక్క నరసింహులు తండ్రి రామస్వామి వయసు 27 సంవత్సరములు కులము ఎస్సీ మాదిగ వృత్తి కూలి పని గారి ఫిర్యాదు మేరకు ఈరోజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించడం అయినది
53-54

## మైనర్ బాలికపై లైంగిక దాడి ...




**•కేసు పెట్టిన కుటుంబంపై దాడి, తల్లి ఆత్మహత్యాయత్నం....**




అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలం గూడుపల్లి గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బాధితుల సమాచారం మేరకు, కనకంటి వారిపల్లికి చెందిన కిట్ట భార్య భవాని (30) తన (10) సం కుమార్తె పై అదే గ్రామానికి చెందిన ప్రతాప్ లైంగిక దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయితే కేసు పెట్టినందుకు ఆగ్రహించిన నిందితుడి కుటుంబ సభ్యులు ప్రతాప్, శంకర, కవిత, చిన్న పార్వతమ్మ, సుబ్బమ్మ, పెద్దరెడ్డి, చిన్నరెడ్డి, జయమ్మ, నరసింహులు, నాగలక్ష్మి, రెడ్డెప్ప కలిసి బాధిత కుటుంబంపై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలతో తీవ్ర మనస్థాపానికి గురైన భవాని విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇక ఈ కేసులో నిందితులకు ములకలచెరువు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. తన కుమార్తెకు న్యాయం చేయాలని భవాని ఆసుపత్రిలో కన్నీటి వేడుకోలు. ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

## గేదెలను దొంగలించిన నలుగురు దొంగలు అరెస్ట్.



ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు డిఎస్పి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. కృష్ణ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల ఎస్సై టి సుధీర్ వారి సిబ్బంది సహాయంతో సి సి ఫుటేజ్ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గత నెల ఫిబ్రవరి 26 రాత్రి సమయంలో ద్వారకా తిరుమల మండలం పాములవారిగూడెంలో కొబ్బరి తోటలో గేదెల షెడ్డు వద్ద రెండు గేదులు, ఒక లేగదూడను దొంగలించారు. తిరుమల పాలెం గ్రామానికి చెందిన బోడ శ్రీరాములు ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశారు. కేసును సవాల్గా తీసుకున్న పోలీసులు గేదెలను దొంగలించిన నలుగురు ముద్దాయిలను ఆదివారం ఉదయం అరెస్టు చేశారు. నలుగురు ముద్దాయిలు చెడు వ్యసనాలకు అలవాటు పడి గేదెలను దొంగలించారని విచారణలో తెలిపారు. ముద్దాయిలు A1 ద్వారకా తిరుమల మండలం తిరుమలంపాలెం చెందిన మిడతా వెంకన్న తండ్రి నారాయణ ,
A 2. నల్లజర్ల మండలం అయ్యవరం గ్రామం కడారి కృష్ణ తండ్రి పోతురాజు,
A3. నల్లజర్ల మండలం అయ్యవరం గ్రామం కడారి సురేష్ తండ్రి కృష్ణ,
A 4. గోపాలపురం మండలం చిట్యాల గ్రామం ఉప్పాటి సుబ్రహ్మణ్యం తండ్రి అబ్బులు నలుగురిని అరెస్టు చేశారు.
కేసు దర్యాప్తులో సహకరించిన పోలీస్ సిబ్బంది .సిహెచ్ .లక్ష్మీనారాయణ, ఎన్ శివ కృష్ణ, ఎం నాగార్జున, వి జయ ప్రకాష్ బాబు.

## 9వ వార్డులో పీపుల్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో నూతన బోర్ల ఏర్పాటుకు భూమి పూజ

**•ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**









పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని 9వ వార్డు లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్థానిక ప్రజలతో కలిసి సమస్యలపై చర్చించి, పరిష్కారం దిశగా అడుగులు వేయటం జరిగింది. పీపుల్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో నూతన బోర్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమి పూజ చేశారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కి పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మున్సిపల్ కమీషనర్ వేణుబాబు, పలువురు అధికారులు, కూటమిపార్టీ నాయకులు, కార్యకర్తలు, 9వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## వరికెపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని..

## వెల్దుర్తి మండల రైతుల, ప్రజల ఐక్య నిరాహార దీక్ష





వరికిపూడి శాల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టా లని కోరుతూ ఆదివారం వెల్దుర్తి మండలంలోని రైతులు, ప్రజలు ఒకరోజు ఐక్య నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు జీవో నెంబర్ 14 ప్రకారం ప్రాజెక్టుకు సంబంధించిన 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వరికెపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలం లోని రైతులు, ప్రజలు వారి సొంత గృహాల్లోనే నిరాహార దీక్ష చేపట్టారు.

# కష్టకాలంలో ఆదుకున్న ఆలయ ఫౌండేషన్... గ్రామంలో ప్రశంసలు

▪ నిరుపేద కుటుంబానికి అండగా ఐఏఎస్ నరహరి

**కరపత్రం ప్రతినిధి వీణవంక మార్చి 22**





కరీంనగర్ జిల్లా వీణవంక మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం మరోసారి దుఃఖంలో మునిగిపోయింది. కొత్తగట్టు సదానందం మంగిలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న సమయంలో, వారి చిన్నారి అనారోగ్యంతో మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది.
ఈ కష్టసమయంలో ఐఏఎస్ అధికారి నరహరి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆలయ ఫౌండేషన్ ముందుకు వచ్చి ఆ కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందించింది. బాధలో ఉన్న కుటుంబానికి ఈ సహాయం కొంత ఊరటనిచ్చింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, వికలాంగులకు జైపూర్ ఫుట్‌లు, వయోవృద్ధులకు వీల్‌చైర్లు అందించడం, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో గత పది సంవత్సరాలుగా సేవలందిస్తున్నామని వివరించారు.మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత ఉద్యోగంలో ఉన్నప్పటికీ, స్వగ్రామానికి సేవ చేయాలనే తపనతో ఐఏఎస్ నరహరి ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్, నేత శివాలయం గుడి చైర్మన్ పల్లెబోయిన రాజ్‌కుమార్ యాదవ్, అందె కుమార్, జీడి వెంకటస్వామి, మారముల్ల సోను, బూర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బెతెస్త ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 22**

జమ్మికుంట పట్టణ పరిధిలోని ఫైర్ స్టేషన్ సమీపంలో ఉన్న బెతెస్త ప్రార్థన మందిరం (చర్చి)లో ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) హాజరై ప్రార్థనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్చి పాస్టర్ అశోక్ చైర్మన్‌ను ఆహ్వానించి, ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాట్లాడిన చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మాట్లాడుతూ, పాస్టర్ అశోక్‌తో తనకు చిన్ననాటి నుంచే మంచి పరిచయం ఉందని, ఆయన దేవునికి చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు.తాను మున్సిపల్ చైర్మన్‌గా రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సేవ చేయడం తన ధ్యేయమని చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఒక సోదరుడిగా ముందుండి పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నానని, నిర్భయంగా తనకు తెలియజేయాలని ప్రజలను కోరారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పాతకాల మౌనిక అనిల్, కుతాటి తిరుపతి, మంద రాధ, మంద రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత

ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో అమెరికా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రష్యా ముడి చమురుపై అమెరికా ఇప్పటికే సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై కూడా ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ చమురును భారత్ సహా ఇతర ఆసియా దేశాల రిఫైనరీలు కొనుగోలు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ ఓ కథనంలో పేర్కొంది .ఇరాన్‌కు చెందిన 170 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, యుద్ధం ప్రారంభమయ్యే నాటికి సముద్రంలో ఉంది. యుద్ధం మొదలు కావడంతో అది సముద్రంలోనే నిలిచిపోయింది. ఈ చమురును సరఫరాలోకి తీసుకొచ్చే క్రమంలో అమెరికా ఉపశమన చర్యలు ప్రారంభించింది. మార్చి 20 లేదా అంతకు ముందు నౌకల్లోకి లోడ్ చేసి, ఏప్రిల్ 19 నాటికి డిశ్చార్జ్ కావాల్సిన ముడి చమురుకు 30 రోజుల సడలింపు ఇస్తున్నట్టు అమెరికా ఆర్థిక శాఖ మంత్రి బెసెంట్ ఓ ప్రకటన చేశారు. ఆ ముడి చమురుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, చెల్లింపుల విషయంలో అమెరికా నుంచి స్పష్టత కోసం ఆసియా దేశాలకు చెందిన పలు రిఫైనరీలు వేచి చూస్తున్నట్టు సమాచారం .రష్యాకు చెందిన 130 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసేందుకు కూడా అమెరికా సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసింది. రష్యా ముడిచమురుతో పాటు తాజాగా ఇరాన్ ముడి చమురు కూడా మార్కెట్‌లోకి వస్తే ఇంధన సంక్షోభం నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాగా, తమ వద్ద ముడి చమురు నిల్వలు లేవని ఇరాన్ ప్రకటించడం గమనార్హం.

# కాకినాడ పోర్టులో చౌకబియ్యం పట్టివేత

విదేశాలకు ఎగుమతి చేసేందుకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కాకినాడ యాంకరేజ్ పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి.. మొత్తం 5 లారీల్లోని 140 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ బియ్యం విలువ రూ.65 లక్షలు ఉంటుందని అంచనా. అయితే ఎవరు వీటిని సరఫరా చేస్తున్నది తెలియాల్సి ఉంది. గతంలో పేర్నినాని తరలించిన బియ్యం వ్యవహారం సద్దు మనగక ముందే మరోమారు పెద్ద ఎత్తున బియ్యం పట్టుబడడం విశేషం.

# కార్యకర్తల విస్తరణే బీజేపీ లక్ష్యం...

▪ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం...
▪ బడ్జెట్ సమావేశాల్లో మంత్రులకే అర్థం కాని బడ్జెట్ ప్రవేశపెట్టిన రేవంత్ రెడ్డి...
▪ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు రాజేంద్ర ప్రసాద్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 22**






జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లో నిర్వహించిన ప్రశిక్షణ శిబిరంలో ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదగడానికి ప్రధాన కారణం కార్యకర్తల కృషి, క్రమశిక్షణ, దేశభక్తి అని పేర్కొన్నారు.
పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను ఆధారంగా తీసుకుని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు గ్రామ స్థాయిలో చివరి వ్యక్తి వరకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో బీజేపీ బలోపేతం కావాలంటే కార్యకర్తల విస్తరణ అత్యంత కీలకమని వారు తెలిపారు.
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో బీజేపీ నాయకులు ముందుండాలని సూచించారు.
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఆశలను నెరవేర్చలేకపోయిన ప్రభుత్వం ఇప్పుడు బడ్జెట్ సమావేశాల్లో కూడా స్పష్టత లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, ఆ బడ్జెట్ మంత్రులకే అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని ప్రవీణ్ రావు వ్యాఖ్యానించారు.
అదేవిధంగా, రాష్ట్రంలో అభివృద్ధి కంటే ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. రైతులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. బీజేపీ మాత్రం ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
ఈ శిబిరంలో పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిగాయి. బూత్ స్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీని ఎలా బలపరచాలి, కొత్త సభ్యులను ఎలా చేర్చాలి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి అనే విషయాలపై కార్యకర్తలకు మార్గదర్శనం ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో రంగు భాస్కరాచారి, ముదిగంటి విద్యాసాగర్ రెడ్డి, పుప్పాల రఘు, ఆకుల రాజేందర్, కనుమల గణపతి, మండల అధ్యక్షులు కొలకాని రాజు, బైరెడ్డి వెంకటరమణారెడ్డి, సర్పంచులు ఉప్పల రాజారం, కవిడి కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ టంగుటూరి రాజ్ కుమార్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు మరియు బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వివక్షకు నిరసనగా...
# 25న జర్నలిస్టుల "ఛలో హైదరాబాద్"

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మార్చి 22:**

జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా ఈ నెల 25వ తేదీన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్- ఐ అండ్ పీఆర్ ఆఫీస్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల తీవ్రమైన వివక్ష చూపుతుందని చెప్పడానికి మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెటే నిదర్శనమని అన్నారు. బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేకపోవడం, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంతవరకు ఇవ్వలేదని,హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పు సాకుతో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ వేయలేదని, పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు.ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 25న తలపెట్టిన "ఛలో హైదరాబాద్-ఐఅండ్ పీఆర్ ఆఫీస్" ఆందోళన కార్యక్రమంలో రాష్టవ్యాపితంగా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# క్రీడాకారులకు ట్రాక్ షూట్లు అందజేత

▪ ప్రతిభావంతులను ప్రోత్సహిస్తాం డా. డి రఘురామన్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 22**



ఎలాంటి క్రీడా నేపథ్యం లేని కుటుంబం నుండి వచ్చిన మెరికల్లాంటి హ్యాండ్ బాల్ క్రీడాకారులు,నిత్య శిక్షణతో రాష్ట్ర జాతీయ స్థాయి పతకాలు పండిస్తున్న మట్టిలోని మాణిక్యాల వివరాలను విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు బెజ్జంకి రాజగోపాల్ ద్వారా తెలుసుకున్న కరీంనగర్లో ని బోయవాడకు చెందిన దారం సుశీల ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ దారం రఘురామన్ ట్రస్టు ద్వారా ప్రోత్సహించాలనుకున్నారు. వీరి వివరాలను తెలుసుకున్న సత్వరమే వారికి ట్రాక్ సూట్లను అందజేయడం విశేషం. వివరాల్లోకి వెళితే ఉమ్మడి జిల్లాలోని గుల్లకోట గ్రామం హ్యాండ్ బాల్ క్రీడకు ప్రసిద్ధి. ఇక్కడ పని చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ శిక్షణలో ప్రతివావంతులైన క్రీడాకారులు ఎందరో వెలుగులోకి వచ్చారు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో ఈ గ్రామం నుండి రాష్ట్ర , జాతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం తన క్లినిక్ లో ట్రాక్ షూట్ తో పాటు పర్సనల్ కిట్ అందజేసి డాక్టర్ రఘురామన్ అభినందించారు. వీరిలో జి.విష్ణు వర్ధన్ ఎస్జీఎఫ్ ఖ-17లో జాతీయస్థాయిలో బంగారు పతకంతోపాటు ఎస్జీఎఫ్ U-19 జాతీయ ఛాంపియన్‌షిప్ (గుజరాత్)లో పాల్గొన్నాడు. అరవింద్ ఉత్తరప్రదేశ్‌లో జూనియర్ నేషనల్స్. గుజరాత్ లో జరిగిన ఎస్జీఎఫ్ U-19 జాతీయ ఛాంపియన్‌షిప్ లో పాల్గొన్నాడు .
వి.అఖిల
U-19 నేషనల్ ఛాంపియన్‌షిప్ హిమాచల్ ప్రదేశ్,
జె. తిర్హా
గుజరాత్‌లో ఎస్జీఎఫ్
U 17 నేషనల్స్,రాజస్థాన్‌లోని జరిగిన జూనియర్ నేషనల్స్ లో పాల్గొంది. బి. శ్రీజ ఎస్జీఎఫ్
U-19 హిమాచల్ ప్రదేశ్ జరిగిన నేషనల్ పాల్గొంది.
జె.అక్షయ
బెంగళూరులో జరిగిన జూనియర్ నేషనల్స్ లో పాల్గొన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించాలని ఈ సందర్భంగా డాక్టర్ రఘురామన్ ఆకాంక్షించారు.

# నగునూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఏడు రోజుల ప్రత్యేక శిబిరం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 22**



కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ , పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు గ్రామంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం 3 వ రోజు సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకొని సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాతవాహన యూనివర్సిటీ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లైఫ్ స్కిల్స్ గురించి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు వివరించడం జరిగింది. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర కీలకమని తెలియజేస్తూ ఈ శిబిరాల ద్వారా గ్రామాల్లో గల సమస్యల పట్ల అవగాహన పెంపొందించుకుంటూ పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి మహేశ్ మాట్లాడుతూ గ్రామంలో ఏడు రోజుల సేవా కార్యక్రమాలకు వాలంటీర్లు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత మూఢనమ్మకాల నిర్మూలన అక్షరాస్యత యొక్క ప్రాముఖ్యత మొదలగు అంశాల పట్ల ర్యాలీ నిర్వహించారు. శ్రమదాన కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాలో గల పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, డాక్టర్ గోపికృష్ణ, గ్రామ సర్పంచ్ ఎస్. శ్రావణి మహేందర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్,బైరం మహేష్, నాంపల్లి శ్రీనివాస్ , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు .